



మీ విజన్ మారాలి!

- ఉమ్మడి జిల్లాలో అభివృద్ధికి ఆస్కారం
- కోనసీమలో తలసరి ఆదాయం పెంచండి
- కాకినాడ-అనకాపల్లి మధ్య ఎయిర్‌పోర్టు
- కడియం నర్సరీలను అభివృద్ధి చేయాలి
- ఎకనమిక్ రీజియన్ సదస్సులో సీఎం
- కలెక్టర్లకు చంద్రబాబు దిశానిర్దేశం

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో అభివృద్ధికి చాలా ఆస్కారం ఉంది. కానీ ఆ స్థాయిలో ఇంకా అభివృద్ధికి నోచుకోలేదు. ఇప్పుడు ఈ జిల్లాలను విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో చేర్చిన నేపథ్యంలో విజన్ ప్లాన్‌తో అభివృద్ధిని పరుగులు పెట్టించాలి. ఆయా జిల్లా కలెక్టర్లకు ఈరోజు నుంచే రన్నింగ్‌రేస్ మొదలైనట్టు అని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ సదస్సు గురువారం విశాఖలో జరిగింది. రీజియన్ పరిధిలోని తొమ్మిది జిల్లాల కలెక్టర్లను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. సదస్సులో కాకినాడ, కోనసీమ కలెక్టర్లు షాన్‌మోహన్, మహేష్‌కుమార్, తూర్పుగోదావరి నుంచి మరికొందరు అధికారులు హాజరయ్యారు. ఎకనమిక్ రీజియన్ పరిధిలోని జిల్లాల్లో ప్రస్తుత స్థితిగతులు, భవిష్యత్తు అభివృద్ధి ఏవిధంగా చేయాలనే దానిపై ప్రత్యేక బుక్‌లెట్‌ను సీఎం ఆవిష్కరించారు. రీజియన్ పరిధిలోని జిల్లాల్లో పర్యాటకాన్ని మరింత ప్రోత్సహించడానికి పెద్దఎత్తున కలెక్టర్లు కృషిచేయాలని ఆదేశించారు. పర్యాటక ఈవెంట్లు, ఎగ్జిబిషన్లు తరచూ జరగాలని సూచించారు. విశాఖ నుంచి చెన్నై వరకు ప్రస్తుతం ఉన్న రెండు రైల్వే లైన్లు భవిష్యత్తులో నాలుగుకు పెరగబోతున్నాయని తద్వారా రైళ్ల వేగం పెరుగుతుందన్నారు. సముద్ర తీరం, హైవేలు విస్తృతంగా ఉన్నాయని, ఎయిర్ కనెక్టివిటీని పెంచడం కోసం కాకినాడ-అనకాపల్లి మధ్య చిన్న ఎయిర్‌పోర్టు నిర్మిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లాలో అద్భుతమైన కడియం నర్సరీలు ఉన్నాయని, వీటిని ఇంకా లాజికల్‌గా మరింతగా అభివృద్ధి చేయాలని సూచించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు చాలా ఉన్నా సరే వాటిని మరింతగా ప్రమోట్ చేయడం లేదని దీనిపైనా దృష్టిసారించాలని సూచించారు. సముద్రం, నది ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో రివర్‌క్రూయిజ్‌కు చాలా భవిష్యత్తు ఉందన్నారు. అన్నవరం నుంచి శ్రీకాకుళం వరకు టెంపుల్ టూరిజం మరింత అభివృద్ధిచేయాలని ఆదేశించారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలోని జిల్లాల అభివృద్ధికి తరచూ సమీక్షలు జరగాలని, ఈ రీజియన్‌కు చైర్మన్‌గా తానే వ్యవహరిస్తానని చంద్రబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కాకినాడ తలసరి ఆదాయం రూ.2.42 లక్షలు

తలసరి ఆదాయంలో కోనసీమ జిల్లా చాలా వెనుకబడి ఉందని సీఎం గుర్తుచేశారు. ఆ జిల్లా కలెక్టర్ ఇక్కడే ఉన్నారు.. ప్రజల తలసరి ఆదాయం పెంచకపోతే ప్రజలకు అన్యాయం జరుగుతుంది. దీనిపై దృష్టిసారించి ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా చూడాలని ఆదేశించారు. రీజియన్‌లోని తొమ్మిది జిల్లాల్లో ప్రజల తలసరి ఆదాయాలను ప్రస్తావించారు. కాకినాడ జిల్లా ప్రజల తలసరి ఆదాయం రూ.2.42 లక్షలు, కోనసీమ రూ.2.06 లక్షలు, తూర్పుగోదావరి జిల్లా 2.59 లక్షలుగా ఉందన్నారు. ఇకపై రీజియన్ పరిధిలో జిల్లాల్లో అభివృద్ధిని పరుగులు తీయించడానికి విజన్ ప్లాన్ అమలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లాలు ఏ అంశాల్లో బలంగా ఉన్నాయి.. ఎక్కడ వెనుకబడి ఉన్నాయో గుర్తించి అందుకు తగ్గ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కాకినాడలో రెండు పోర్టులను విదేశీ ఎగుమతులు దిగుమతులకు ఎక్కువగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ సాగు విషయంలో రీఓరియంటేషన్ జరగాలని చెప్పారు.



పిఠాపురంలోని వెలుగు కార్యాలయం

‘వెలుగు’ చూసేనా..

- 168 సంఘాల పేరుతో రూ.18.89 కోట్లు పక్కదారి
- బంధువుల పేరుతో సంఘాలు ఏర్పాటు చేసుకున్న వెలుగు సిబ్బంది
- పక్క మండలాలు, జిల్లాల మహిళలు సభ్యులే
- నామమాత్రంగానే చర్యలు
- అధికారుల పాత్ర విస్మరణ
- సమగ్రంగా దర్యాప్తు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు
- రికార్డులు సీఐడీకి అప్పగింత.. పరిశీలన ప్రారంభం

సంచలనం కలిగించిన పిఠాపురం రుణాల స్వాహా కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఇప్పటికే కేసు నమోదు చేసిన పోలీసులు ఒకరిద్దరు సిబ్బందిని మాత్రమే అరెస్టు చేశారు. కింది స్థాయి సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులను విస్మరించడంపై పలు అనుమానాలు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి. ఇప్పటికే సీఐడీ అధికారులు రికార్డుల పరిశీలనను ప్రారంభించడంతో అక్రమార్కులైన అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.



రుణాలు తీసుకోకుండానే నోటీసులు వచ్చాయంటున్న మహిళలు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

పి.తిమ్మాపురం క్లస్టర్ పరిధిలోని పిఠాపురం మండలం బి.కొత్తూరు, ఎల్ఎన్ పురం తదితర గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఏకంగా 168 సంఘాలను ఏర్పాటుచేసి రూ.18.89 కోట్ల రుణాలను పక్కదారి పట్టించారు. అప్పటి వీవోఏతోపాటు సీసీ, ఇతర సిబ్బంది, కొందరు ప్రైవేటు వ్యక్తులు కుమ్మక్కయి అప్పటికే సంఘాల్లో సభ్యులుగా ఉండి వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న 211 మంది మహిళల పత్రాలను తీసుకుని ఫోర్జరీ పత్రాలు సృష్టించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ మండలాలు, జిల్లాలకు చెందిన మహిళలతో కలిపి సంఘాలను ఏర్పాటుచేశారు. 2018 నుంచి 2023 వరకు ఈ ప్రక్రియ యథేచ్ఛగా సాగింది. ఫోర్జరీ పత్రాలు, ఇతర సంఘాల్లో ఉన్నవారితో సంఘాలు భారీగా ఏర్పాటవుతున్నా ఉన్నతాధికారులు ఎవ్వరూ పట్టించుకోలేదు. ఈ సంఘాలకు బ్యాంకుల నుంచి రుణాలు చకాచకా మంజూరయ్యాయి. పిఠాపురంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ నుంచి 141 సంఘాలకు రూ.16.24 కోట్లు, డీసీసీబీ పిఠాపురం బ్రాంచి నుంచి 27 సంఘాలకు రూ.2.65 కోట్లు మంజూరు చేశారు. మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేసే సమయంలో ఆ సంఘంలోని సభ్యులందరి సంతకాలను తమ సమక్షంలో తీసుకుని, వారి ఆధార్‌తో రుణ చరిత్రను, వారు ఏయే ప్రాంతాలవారు, వారికి ఇతర బ్యాంకుల్లో రుణాలు ఉన్నాయా లేదా పరిశీలించాల్సిన బ్యాంకు అధికారులు అవేమీ లేకుండానే వెలుగు వీవోఏ (యానిమేటర్)లు సీసీ ద్వారా రుణ దరఖాస్తు రాగానే మంజూరు చేసేశారు. మొత్తం ఈ వ్యవహారమంతా వెలుగు సిబ్బంది, అధికారులు, బ్యాంకు అధికారులు, సిబ్బందికే తెలిసి జరగడంతో ఐదేళ్లపాటు వెలుగు చూడలేదు. ఇందులో కొందరు వైసీపీ నేతల హస్తం ఉందనే ఆరోపణలున్నాయి. పి.తిమ్మాపురం క్లస్టర్ కమ్యూనిటీ కో-ఆర్డినేటర్ (సీసీ)గా పనిచేసిన ఎంఆర్ మీనాక్షి కనకదుర్గ ఎస్‌హెచ్‌జీలో సభ్యురాలిగా చేరింది. అదే విధంగా తన బంధువులు 15 మందితో ఒక సంఘాన్ని ఏర్పాటుచేసి రుణం పొందారు.

ఇలా వెలుగు చూసింది...

బ్యాంకుల్లో అధికారుల మార్పుతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా పిఠాపురం శాఖలో మహిళా సంఘాలు తీసుకున్న రుణాల్లో రూ.11కోట్లు వరకు వసూలు కాకపోవడంతో వారు వెలుగు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇదే రీతిలో డీసీసీబీ పిఠాపురం బ్రాంచి నుంచి రుణాలు తీసుకున్న వారు చెల్లించలేదు. దీంతో ఆ రెండు బ్యాంకుల అధికారులు తమ రికార్డుల్లో రుణాలు తీసుకున్నట్టు ఉన్న సంఘాల్లో సభ్యులకు తక్షణం రుణాలు చెల్లించాలని, లేకుంటే ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగిస్తామని బ్యాంకుల నుంచి నోటీసులు జారీ అయ్యాయి. తీసుకోని రుణాలకు తాము ఎలా చెల్లిస్తామంటూ మహిళలు అధికారులను నిలదీశారు. ఆందోళనలు నిర్వహించారు. ఇదే రీతిలో పలు గ్రామాల్లో మహిళా సంఘాల మీద రుణాలు తీసుకుని పక్కదారి పట్టించినట్టు ఆరోపణలున్నాయి. రెండు గ్రామాలకు చెందిన మహిళలు కలెక్టర్‌కు ఫిర్యాదుచేయడంతో ఇది బయటకు వచ్చింది.

తప్పించే ధోరణి

కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేపట్టిన అధికారులు దానిని బి.కొత్తూరు, ఎల్ఎన్ పురం గ్రామాలకే పరిమితం చేశారు. నియోజకవర్గంలోని ఇతర గ్రామాలను విస్మరించారు. ఈ నెట్‌వర్క్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్నప్పటికీ అటువైపు దృష్టి పెట్టలేదు. విచారణ అనంతరం దీనిపై డీఆర్డీఏ (వెలుగు) ప్రాజెక్టు డైరెక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి అప్పటి సీసీ ఎంఆర్ మీనాక్షిని విధుల నుంచి సస్పెండ్ చేయగా, వీవోఏ పద్మకుమారిని విధుల నుంచి తొలగించారు. ఈ వ్యవహారాన్ని నిరంతరం పర్యవేక్షించే ఏపీఎంలు, డీపీఎంలు, డివిజన్, జిల్లాస్థాయి అధికారులపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు.

‘ఆంధ్రజ్యోతి’ కథనంతో కదలిక

ఫోర్జరీ పత్రాలతో ఇతర మండలాలు, జిల్లాల మహిళలతో వారికి తెలియకుండానే సంఘాలు ఏర్పాటుచేసి కోట్లాది రూపాయల రుణాల స్వాహా ఘటనలో విచారణ సక్రమంగా జరగట్లేదని, పిఠాపురం నియోజకవర్గంతోపాటు కాకినాడ జిల్లావ్యాప్తంగా దీనిపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని ‘ఆంధ్రజ్యోతి’లో కథనాలు ప్రచురితమయ్యాయి. పూర్తిస్థాయిలో పరిశీలన జరిపితే ఈ రుణాల గోల్‌మాల్ వ్యవహారం ఇంకా భారీస్థాయిలో ఉండే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. తక్షణం కేసుల రికార్డులను రాజమహేంద్రవరం సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి అప్పగించాలని ఆదేశించారు.

రుణాలు చెల్లించేది ఎవరు..

అసలు మహిళలకు తెలియకుండానే రుణాలు తీసుకున్న సంఘటనలో వారి పేరుపై ఉన్న రుణాలను ఎవరు చెల్లిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. బ్యాంకుల ఉన్నతాధికారులు తమ బ్యాంకుల అధికారులు, సిబ్బందిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా తమ తప్పిదం లేనట్టు వ్యవహరించడం, వెలుగు ఉన్నతాధికారులు కూడా జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు సంబంధం లేదనే రీతిలో వ్యవహరిస్తున్న తీరు విస్మయం కలిగిస్తోంది. మండల, డివిజన్, జిల్లా అధికారులతోపాటు కొందరు ప్రైవేటు వ్యక్తుల పాత్ర బయటకు రానివ్వకుండా వెలుగులోని ఒక ఉన్నతాధికారి కాపాడుతున్నట్టు తెలుస్తోంది. సీఐడీకి విచారణ అప్పగించడంతో వీరి పాత్ర వెలుగులోకి వస్తుందని మహిళలు ఆశిస్తున్నారు.

తిరిగి ఇచ్చేయాలి..

లేదంటే లాస్ అయిపోతారు..



- లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లో సొమ్ము ఇచ్చే ప్రయత్నం
- కాకినాడలో 5,88,521 ఖాతాల గుర్తింపు
- వాటి నిల్వ రూ.101.22 కోట్లు
- సరైన పత్రాలు తీసుకొచ్చి సొమ్ములు తీసుకువెళ్లాలంటున్న ఆర్‌బీఐ అధికారులు
- ఇప్పటికే భారీగా ప్రచారం

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో వివిధ బ్యాంకుల్లో ఉన్న వ్యక్తిగత ఖాతాలు 5,72,938.. ఆ ఖాతాల్లో ఉన్న సొమ్ములు అక్షరాలా రూ.83.36 కోట్లు.. వివిధ సంస్థల బ్యాంకు ఖాతాలు 10,048. ఆ ఖాతాల్లో ఉన్న సొమ్ము రూ.12.60 కోట్లు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బ్యాంకు ఖాతాలు 5,535. వాటిలో ఉన్న సొమ్ము విలువ రూ.5.26కోట్లు... ఇలా మొత్తం 5,88,521 బ్యాంకు ఖాతాల్లో ఉన్న సొమ్ము రూ.101.22 కోట్లు.. సుమారు రూ.100 కోట్లకు పైగా ధనం వివిధ బ్యాంకుల్లో మూలుగుతోంది. వాస్తవానికి పదేళ్లకు పైగా లక్షలాది ఈ ఖాతాల్లో లావాదేవీలు జరగడం లేదు.. ఈ ఖాతాలకు సంబంధించిన వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు సరైన ధ్రువపత్రాలతో వచ్చి ఈకేవైసీ పూర్తి చేసి, తమ సొమ్ములను తీసుకువెళ్లాలని ఇటీవల జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. పౌరులు మత పేరున ఉన్న క్లెయిమ్ చేయని, మరిచిపోయిన ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం కల్పించిందని, దేశవ్యాప్తంగా ‘మీడబ్బు- మీ హక్కు’ నినాదంతో భారత ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోందని ప్రకటించారు. పదేళ్ల అంతకుమించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లో సొమ్మును బ్యాంకులు తిరిగి ఇచ్చేస్తున్నాయని ఇటీవల వెల్లడించిన విషయం అందరికీ తెలిసిందే..

నేడు కాకినాడలో ప్రత్యేక శిబిరం..

‘మీ డబ్బు - మీ హక్కు’ నినాదంతో భారత ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. వివిధ కారణాలతో బ్యాంకు ఖాతాల్లో ఉండిపోయిన సొమ్మును తిరిగి పొందేందుకు భారత ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ మార్గనిర్దేశం మేరకు ఈనెల 14న లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో కాకినాడ నగరంలోని తిలక్ స్ట్రీట్‌లోని గల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖాలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్టు లీడ్ బ్యాంకు మేనేజర్ సీహెచ్ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. పదేళ్ల, అంతకుమించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లోని సొమ్ములు అర్హులైన ఖాతాదారులకు తిరిగి ఇచ్చేస్తున్నామన్నారు. ఖాతాదారుని మరణం, చిరునామా మార్పు, నామినీ వివరాలలో లోపాలు, మరచిపోవడం వంటి కారణాలతో కొన్ని ఖాతాల్లోని డబ్బులు నిజనమైన లబ్ధిదారులకు చేరడం లేదన్నారు. వీటికి సంబంధించిన వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు సరైన ధ్రువపత్రాలు తీసుకువచ్చి వాటిని తిరిగి పొందాలని ఆయన సూచించారు.

రేపు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం : కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15వ తేదీన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదలచేశారు. ఈ కార్యక్రమం ప్రధానంగా వ్యక్తిగత, సమాజ పరిశుభ్రత అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర దినోత్సవంగా దీన్ని నిర్వహించాలని ఆదేశించారు. బహిరంగ మలవిసర్జన, మూత్ర విసర్జన నిర్మూలనపై దృష్టిసారించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవడానికి విద్యాసంస్థలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వాటర్ శానిటేషన్ అండ్ హైజీన్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పారిశుధ్య పద్ధతులపై ప్రజలకు అవగాహన పెంచాలన్నారు. కమ్యూనిటీ టాయిలెట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు చుట్టూ శుభ్రపర్చే డ్రైవ్‌లను నిర్వహించాలన్నారు. మున్సిపాల్టీలు, గ్రామ పంచాయతీల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లలో కొత్త కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్లు నిర్మాణాలకు స్థల సేకరణ చేయాలన్నారు. పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లు, బస్టాండ్లలో టాయిలెట్లను గుర్తించి వాటి నిర్వహణ మెరుగుపర్చాలన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి క్రమం తప్పకుండా ప్రజామరుగుదొడ్ల లభ్యత వాటి నిర్వహణను నిర్ధారించడానికి ఎన్‌హెచ్ఏఐ రాష్ట్ర రహదారుల విభాగాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. స్థిరమైన నమూనాల కింద ప్రజా మరుగుదొడ్ల అవగాహన, నిర్వహణ కోసం స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, యువజన సంఘాల భాగస్వామ్యం చేయాలన్నారు. ఈనెల 19న ప్రపంచ టాయిలెట్ దినోత్సవం సందర్భంగా సురక్షితమైన పారిశుధ్యం, టాయిలెట్ వినియోగం, పరిశుభ్రత ప్రవర్తన ప్రాముఖ్యతపై పోటీలు నిర్వహించాలన్నారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు విధిగా పాల్గొనాలన్నారు.

ఆశలు వరించెన్!



- ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు సమాయత్తం
- ఉత్పత్తి అంచనా 3 లక్షల మెట్రిక్ టన్నులు
- సేకరణ లక్ష్యం 2.8 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పుడిప్పుడే ఆరంభమైన కోతలు

ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైసు మిల్లులకు ధాన్యం విక్రయిస్తున్నారు.

సామర్లకోట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : రైతులకు ఖరీఫ్ రిలీఫ్ వచ్చేసింది.. ఇప్పటికే సాగుచేసిన స్వల్పకాలిక వరి వంగడాలు కోతకు వచ్చాయి. మరో వారంలో దీర్ఘకాలిక రకాలు కోతకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విడతల వారీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరిచేందుకు పౌర సరఫరాల శాఖ సమాయత్తం అవుతుంది. జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ సాగు విస్తీర్ణం 94 వేల హెక్టార్లు ఉండగా 269 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ధాన్యం ఉత్పత్తి అంచనా 3 లక్షల మెట్రిక్ టన్నులు కాగా కొనుగోలు లక్ష్యం 2.80 లక్షల మెట్రిక్‌టన్నులు. ఇప్పటికే కాకినాడ జిల్లాలో సామర్లకోట, కరప, గండేపల్లి, పెదపూడి, యు.కొత్తపల్లి మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో గురువారం సాయంత్రం నాటికి 1,860.960 మెట్రిక్ టన్నుల మేర ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించారు. గురువారం సాయంత్రం నాటికి రైతులు బ్యాంకు ఖాతాల్లో రూ. 2.97 కోట్ల మేర సొమ్ములు జమయ్యాయి. అత్యధికంగా సామర్లకోట మండలంలో 590.320 మెట్రిక్ టన్నుల మేర ధాన్యాన్ని కొనుగోలు చేసి అగ్రస్థానంలో ఉంది. సొమ్ములందుకున్న రైతుల్లో సామర్లకోట మండలంనకు చెందిన రైతులే అధికంగా ఉండడం విశేషం. రైతులకు సొమ్ములు కేవలం 24 గంటల్లో జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో రైతులు ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లేందుకే మొగ్గు చూపుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు ధాన్యం అమ్ముకోవాలంటే సవాలక్ష నిబంధనలు ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిబంధనలు సడలించి నచ్చిన రైస్ మిల్లులకు రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునే వెసులుబాటు కల్పించింది. సకాలంలో సొమ్ములు రైతు ఖాతాల్లో జమయ్యేలా

సార్.. ఇవీ సమస్యలు

రైతుసేవా కేంద్రాల పరిధిలో ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏటా పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్లు, హెల్పర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమిస్తున్నారు. వీరిలో అధిక శాతం గత వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన వైసీపీ కార్యకర్తలే. కొందరి రైస్‌మిల్లు యాజమాన్యాలకు అనుకూలంగా వీరు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు రైతుల నుంచి వినవస్తున్నాయి. మిల్లర్లు ఇస్తున్న తాయిలాలకు ఆశపడి ధాన్యం లోడులు వారికే తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో సామర్లకోట మండలం పి.వేమవరం పరిసర ప్రాంతాల్లో కొనుగోలు చేసిన ధాన్యానికి చెందిన లక్షలాది రూపాయల మేర గోల్‌మాల్ జరిగిందన్న ఫిర్యాదులు, విచారణలు జరిపిన విషయం విదితమే. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించే ధాన్యం లెక్కగట్టే క్రమంలో అదనంగా 10 కిలోల నుంచి 30 కిలోల మేర ఉంటే వాటికి వచ్చే సొమ్ముల ఎవరి ఖాతాలో జమ అవుతుందో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో నేటికీ చిరిగిన గోనెసంచులు దర్శనమిస్తున్నాయి.దీంతో రవాణా సమయాలలో రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపైకి ఒలిగిపోతున్నా ఏమీచేయలేని నిస్సహాయస్థితిలో ఉంటున్నారు.ధాన్యం కొనుగోలులో ప్రత్యేక నిఘా ఉండాలి. కొనుగోలు ప్రక్రియ ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా మండల స్థాయి కమిటీని రైతులతోనూ, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతోనూ ఏర్పాటుచేయాలి. ఏదైనా సమస్య ఉత్పన్నమైనా, ఇబ్బందులు ఎదురైనా ఫిర్యాదుకు చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్లు అన్ని ప్రాంతాలలో అందుబాటులో ఉంచాలి.

మాస్టారు : ఒక 20 ఏళ్ల కుర్రాడు.. చదువులో ఫస్ట్..మాస్టారి ప్రియశిష్యుడు. ఆ అభిమానంతో బాల్యం గురించి చెప్పమని స్టేజ్‌పైకి పిలిచారు..
విద్యార్థి : మాస్టారిని చూసి బాల్యం గురించి ఏం చెబుతాం సార్ అన్నాడు.. అది విన్నవారంతా ఒక్కసారి అవాక్కయ్యారు..
మాస్టారు : నీకు బాల్యం లేదా అని మాస్టారు తిరిగి ప్రశ్నించాడు..
విద్యార్థి : వెంటనే ఉంది సార్..
మాస్టారు : అయితే చెప్పు అన్నారు..
విద్యార్థి : బాల్యం గురించి చెప్పడం మొదలుపెట్టాడు.. చదివిన పాఠశాల.. ర్యాంకులు తప్ప.. ఏమీ లేదు..
మాస్టారు : ఇదేనా నీ బాల్యం..
విద్యార్థి : అవును సార్.. మా అమ్మానాన్న ఉద్యోగులు... నేను చిన్నతనం నుంచి హాస్టల్ ఉండి చదువుకున్నా అని తన బాల్యం గురించి చెప్పుకొచ్చాడు.



మారాలి.. అమ్మా..నాన్న!

ఈ తరం విద్యార్థులను ఎవరిని పలకరించినా ఇదే బాల్యం.. ఆటల్లేవ్.. పాటల్లేవ్.. తాత నానమ్మతో కబుర్లేవ్.. పుస్తకాలతో కుస్తీ.. ర్యాంకులతో దోస్తీ.. ఉరుకులు.. పరుగుల జీవితమే.. క్లాస్‌లో ఫస్ట్ వస్తేనే మాటలైనా.. ఆటలైనా లేదంటే అన్నీ కట్.. ఎటు పోతోంది బాల్యం.. ఏమైపోతోంది బాల్యం.. అందుకే ఒకనాడు కానరాని బాలల బలవన్మరణాలు మనం చూస్తున్నాం.. తల్లిదండ్రులారా బాల్యాన్ని బంధించవద్దు.. మీ బాల్యాన్ని మీ పిల్లల్లో చూడండి.. ఆడుకోనివ్వండి.. చదువుకోనివ్వండి.. వారికి మీలా బాల్యం గురుతులు ఉండేలా చూడండి.. నేడు బాలల దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

నేడు బాలల దినోత్సవం



హ్యాపీ..హ్యాపీ డే!

బాలల దినోత్సవం పాఠశాలల్లో విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా జరుపుకున్నారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆయా పాఠశాలల్లో సందడి చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గౌతమి ఇంగ్లిషు మీడియం స్కూలు విద్యార్థులు గురువారం హ్యాపీ చిల్డ్రన్స్‌డే ఆకారంలో కూర్చుని శుభాకాంక్షలు తెలపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
- గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి)

మీకూ.. చట్టాలున్నాయ్!



(మండపేట -ఆంధ్రజ్యోతి)

నేటి బాలలే రేపటి పౌరులు.. దేశభవిష్యత్ బాలల చేతుల్లోనే ఉంది. భారత రాజ్యాంగం ప్రతి చిన్నారి గౌరవ ప్రదమైన జీవితానికి హక్కులు కల్పించింది.ఆ హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం అనేక చట్టాలను చేసింది. కానీ వాటిపై సరైన అవగాహన లేదు. బాలల హక్కుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై తెలుసుకుందాం..

- **జువైనల్ చట్టం :** ఇది 2015లో అమల్లోకి వచ్చింది. 18 ఏళ్లలోపు వయసున్న పిల్లలంతా బాలలే.. నేరాల్లో చిక్కుకున్న లేదా రక్షణ అవ సరమైన పిల్లలకు న్యాయపరమైన రక్షణ కల్పిం చేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో జువైనల్ జస్టిస్ బోర్డులు ఏర్పాటయ్యాయి.బాల సంరక్షణ కమిటీ లు,పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- **విద్యాహక్కు :** బడి ఈడు పిల్లలకు ఉచిత విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2009లో ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. 6-14 సంవత్సరాలు వయసు కలిగిన బాలలకు కుల, ఆర్థిక అసమానతలకు అతీతంగా విద్యను హక్కుగా గుర్తించి అమలు చేస్తున్నారు.
- **బాలకార్మిక వ్యవస్థ నిరోధక చట్టం :** 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవటం నేరంగా భావిస్తూ 1986లో బాలకార్మిక చట్టాన్ని అమల్లోకి తెచ్చింది.14-18 ఏళ్లలోపు పిల్లలను ఉద్యోగాల్లో పెట్టడాన్ని ఈ చట్టం నిరోధిస్తుంది.
- **రక్షణగా 1098 :** ఎవరైనా చిన్నారి ప్రమాదంలో ఉన్నారని తెలిస్తే చైల్డ్‌లైన్ నెంబరు 1098కు ఫోన్‌చేస్తే సంబంధిత అధికారులు స్పందించి రక్షణ కల్పిస్తారు. ఈ నెంబర్ 24 గంటలు అందుబాటులోనే ఉంటుంది.
- **బాల్యవివాహ నిషేద చట్టం 2006 :** 18 ఏళ్ల వయసున్న అమ్మాయిలు, 21 ఏళ్లలోపు వయ సున్న అబ్బాయిలకు పెళ్లి చేయడం నేరం. ఒక వేళ ఇలాంటి వివాహం జరిగినా చెల్లదు. చట్టరిత్యా కూడా నేరంగా పరిగణిస్తారు.
- **పోక్సో చట్టం :** లింగ వివక్ష లేకుండా 18 ఏళ్ల లోపు పిల్లలు లైంగిక దాడులకు గురైతే వారికి రక్షణ కల్పించడమే పోక్సోచట్టం(2012). నేర తీవ్రతను బట్టి జీవితఖైదు లేదా ఉరిశిక్ష విధిం చే అవకాశం ఉంది. కేసులు విచారణకు కేంద్రం ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేసింది.
- **ఉచిత న్యాయ సహాయం :** న్యాయ సేవాధి కార చట్టం ప్రకారం బాలలందరూ ఉచిత న్యాయ సహాయానికి అర్హులే. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో న్యాయసేవాధికార సంస్థను సంప్ర దించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చు.

పిల్లలను చైతన్యపరచాలి

బాలల హక్కుల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నప్పటికి వాటిపై అవగాహన లేక న్యాయం పొందలేక పోతున్నారు. పిల్లలను చైతన్య పరిచే ఉద్దేశంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పాఠశాలలు ,కళా శాలల్లో న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తోంది. ప్రతి ఒక్కరు చట్టాలు తెలుసుకుని పిల్లలను చైతన్య పరచాలి.
- అబ్బులునాయుడు, న్యాయవాది, మండపేట

వీరి..వీరి గుమ్మడిపండు.. వీరి పేరేమి!

(మండపేట -ఆంధ్రజ్యోతి)

కాలం మారింది.. పల్లె జనం పట్టణ బాట పడు తున్నారు. వీరిలో పిల్లల చదువుల నిమిత్తం వచ్చే వారే ఎక్కువ. పూర్వం గ్రామాల్లో ఉండే ప్రభుత్వ పాఠ శాలల్లో పిల్లలను చదివించుకునేవారు. కానీ నేడు కార్పోరేట్ విద్యకు అలవాటు పడి ప్రైవేటు విద్యాసంస్థల్లో పిల్లలను చేర్పించి వారి కోసం తల్లిదండ్రులు పట్టణాల బాట పడుతు న్నారు. మార్కులు ర్యాంకులు మంచి కళాశాలలో సీట్లకు పిల్లలను ఆటపాటలకు దూరం చేస్తున్నారు. చదువుల పేరిట పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పూర్వం ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు పిల్లలకు తల్లిదండ్రులతో పాటు తాత బామ్మ, మావయ్య, చిన్నాన్న, చిన్నమ్మ, పెద్దమ్మ, అత్తమామ ఇలా అనేక బంధాలు ఉండేవి.కానీ నేటి పిల్లలకు అంకుల్ ఆంటీ పేర్లు తప్పించి అసలు బంధువులెవరు వారేమవు తారో కూడా తెలియని పరిస్థితి.నోరారా తాతయ్య అమ్మమ్మ, నానమ్మ, మావయ్య అమ్మానాన్న అన్న తమ్ముడు పేర్లు కూడా పిల్లల నోట విందామన్న వినిపించడం లేదు. కారణం నేడు ప్రైవేటు పాఠశాలల్లో చదువుల చట్రంలో పిల్లలు బందీలుగా మారిపోతు న్నారు. ర్యాంకులు మార్కులు పేరిట పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నలిగిపోతున్నారు. పిల్లలు ఆడిపాడే సమయం లేక మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. పూర్వం పిల్లలకు బామ్మ తాతయ్యల నీతికథలు చెప్పేవారు..పాతకాలంనాటి జ్ఞాపకాలు చెప్పేవారు. ఎలా ఉండకూడదో .. ఎలా ఉండాలో చెప్పేవారు.. అందుకే నాడు చిన్నారులకు ఆత్మహత్య అంటే కూడా ఏంటో తెలి యదు.. నేడు వారేవరు పిల్లలకు దగ్గరగా ఉండకపోవడం వారంతా పల్లెల్లో ఉండడం చదువుల పేరిట పట్టణాల్లో పిల్లలు ఉండడం వల్ల పిల్లల పల్లె బంధాలకు దూరమవుతూ పట్టణ వాతావరణంలో ఉండిపోతున్నారు. కేవలం పండుగల సమయంలో తప్ప పల్లె వాతావరణం గురించి పిల్లలకు తెలియడం లేదు. ప్రస్తుతం పిల్లలు సెల్‌ఫోన్‌కు బంధీగా మారిపోయారు. పూర్వం నీతికథల పుస్తకాలు చదువుకునేవారు.కానీ నేడు అంతా సెల్‌లో ఆటలు ఇంటర్‌నెట్‌లో పాఠాలు, సినిమాలతో బాల్యం గడిచి పోతుంది.

- చిన్ననాటి చిరు గురుతుల్లేవ్
- బంధువులులేరు.. సమయమూ లేదు..
- చదువుల పేరిట పట్టణాలకు క్యూ
- 24 గంటలూ పుస్తకాలతో కుస్తీ
- బందీగా మారుతున్న చిన్నారులు
- మానసిక ఒత్తిడిలో బాల్యం

పూర్వం పిల్లలు బడి నుంచి ఇంటికి రాగానే తోటిపిల్లలతో ఏడుపెంకెలు ఆట, గోలీలు కోతి కొమ్మచ్చి, వాలీబాల్, షటిల్, పరుగుపందాలు, వీరివీరి గుమ్మడిపండు, అష్ట చమ్మా వంటి ఆటపాటలతో ఆనందంగా గడిపేవారు. నేడు అవేమీ మచ్చుకు కనిపించడం లేదు. చదువులు పేరిట పట్టణ బాట పట్టిన చిన్నారులు జంక్‌ఫుడ్ రుచులకు అలవాటు పడి అనారోగ్యం పాలవుతు న్నారు. నేడు అమ్మచేతి వంట పిల్లలకు రుచించడం లేదు.





సెల్ సిగ్నల్ రావే.. మా బుజ్జాయికి బువ్వ తినిపించవే!

(ఉప్పలగుప్తం-ఆంధ్రజ్యోతి)

తల్లిదండ్రుల మాట తీరు, అందించే ఆహారం పిల్లల భవిష్యత్తును ప్రభావితం చేస్తుందనడంలో సందేహం లేదు. చందమామ రావే! జాబిల్లి రావే!..... అన్నీ తెచ్చి మా పాపాయికియ్యవే... అంటూ ఆ కన్నతల్లి తన బిడ్డకు గోరుముద్దలు తినిపిస్తోంది. తిననని మారాం చేస్తున్న పాపాయికి ఏవేవో కబుర్లు చెప్పి మభ్యపెట్టి మరీ ముద్ద నోటికందిస్తోంది. పెదాలు బిగబట్టి ససేమిరా అంటున్న తన బిడ్డకు నయానాభయానా ఆ కన్నతల్లి అన్నం తినిపించి అమ్మగా తన పాత్రకు పూర్తి న్యాయం చేస్తోంది. ఇది గత చరిత్ర. ఇప్పుడు చంటి బిడ్డకు గోరుముద్దలు తినిపించేంత సమయం ఎందరు తల్లులకుంది? తమ పనుల్లో తాము బిజీగా ఉంటున్న తల్లులు సెల్‌ఫోన్ చేతుల్లో పెట్టి పాపాయికి అన్నం తినిపించడం క్షణాల్లో కానిచ్చేస్తున్నారు. చందమామ కథలూ లేవు. బతిమాలి తినిపించడాలూ లేవు. మూడేళ్లు నిండిన బాలల్లో 80 శాతం మంది విద్యాలయాల్లోనే గోరుముద్దలు తింటున్నారు. గతంలో ఐదేళ్లు వచ్చే వరకు పిల్లలు ఇంటి వద్దే ఆటపాటలతో హాయిగా కాలం గడిపేవారు. ఈ కారణంగా వారి మానసిక, శారీరక ఆరోగ్యం ఎంతో దృఢంగా ఉండేది. మరిప్పుడు మూడేళ్లు రాగానే పిల్లలను విద్యాకేంద్రాలకు పంపించడంతో ఇరుకు గదుల్లో రోజంతా గడుపుతున్నారు. వాడిన ముఖాలతో ఇంటికొస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇటీవల జరిగిన ఒక సర్వే 40 శాతం పిల్లల్లో రక్తహీనత ఉన్నట్టు వెల్లడించిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇది నడుస్తున్న చరిత్ర. అన్నప్రాసన అనంతరం తమ పిల్లల్లో వస్తున్న మానసిక మార్పులను తల్లిదండ్రులు నిశితంగా పరిశీలించాలి. ఏదైనా ఒక అంశంలో వారి స్పందన తీరును గమనించాలి. వారి ఇష్టాలు తెలుసుకుని మంచివైతే మద్దతివ్వాలి. చెడు విషయంలో వారికి అర్థమయ్యేరీతిలో అవగాహన కల్పించాలి. వారిలో మార్పు తీసుకురావాలి. ఇలా జరగాలంటే తల్లిదండ్రుల మాటతీరు పిల్లలకు నమ్మబాటయ్యే విధంగా ఉండాలి. పిల్లల ఆహార విషయంలో తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యానికి మాత్రమే ప్రాధాన్యమివ్వాలి.



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు కాలువలో నీటి ప్రవాహం

ఏలేరుకు పెరిగిన ఇన్‌ఫ్లోస్

అవుట్‌ఫ్లోస్ 775 క్యూసెక్కులకు పరిమితం

పిఠాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏలేరు రిజర్వాయర్‌కు అకస్మికంగా ఇన్‌ఫ్లోస్ పెరిగాయి. కొన్ని రోజులుగా రిజర్వాయర్ నుంచి కాలువలకు నీటి విడుదలను కొనసాగిస్తున్న నేపథ్యంలో నీటి నిల్వలు కొంతమేర తగ్గాయి. దీంతో ఇన్‌ఫ్లోస్ పెరిగినా ఎటువంటి ఇబ్బంది ఉండదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మండలాల నుంచి ఏలేరు రిజర్వాయర్‌లోకి వస్తున్న ఇన్‌ఫ్లోస్ ఉదయం 6 గంటలకు 1175 క్యూసెక్కుల నుంచి 1438 క్యూసెక్కులకు పెరిగాయి. అనంతరం తగ్గినా మరలా మధ్యాహ్నం 12 గంటలకు 2,630 క్యూసెక్కులకు పెరిగింది. రాత్రి వరకు ఇదే స్థాయిలో ఇన్‌ఫ్లోస్ వస్తున్నాయి. కాలువలకు నీటి విడుదలను 975 క్యూసెక్కుల నుంచి 775 క్యూసెక్కులకు తగ్గించారు. ప్రస్తుతం డీసీఆర్ స్లూయిస్ ద్వారా 600 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, విశాఖ అవసరాలకు 175 క్యూసెక్కులు పంపుతున్నారు.

ప్రస్తుతం ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం 85.58 మీటర్లు ఉండగా, నీటి నిల్వలు 22.125 టీఎంసీలు ఉన్నాయి. గరిష్ఠ నీటిమట్టానికి మరో మీటరు ఉండగా, మరో రెండు క్యూసెక్కుల వరకు నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. ఎగువ ప్రాంతాల్లో వర్షం పడడమే ఇన్‌ఫ్లోస్ పెరగడానికి కారణమని ప్రాజెక్టు అధికారులు చెప్పారు.



హోప్ ఐలాండ్‌ను పరిశీలిస్తున్న అటవీ సంరక్షణాధికారి రామచంద్రరావు

హోప్ ఐలాండ్ సందర్శన

కాకినాడ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారి ఎన్. రామచంద్రరావు క్షేత్ర స్థాయి తనిఖీల్లో భాగంగా గురువారం కోరింగ అభయారణ్యం పరిధిలోని హోప్ ఐలాండ్‌ను పరిశీలించారు. తీరం వెంబడి ఆలివ్ రిడ్లీ టర్టిల్ నెస్టింగ్ ఏరియాలను చూవారు. ఐలాండ్‌లోను, తీర ప్రాంతంలోను ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని రేంజ్ సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న మడ అడవుల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఓఎన్జీసీ జెట్టీ ప్రాంతంలో ముళ్ల పొదలను తొలగించాలని సూచించారు. హెలిప్యాడ్ ప్రాంతాన్ని, కోకోనట్ ప్లాంటేషన్, పాల్ మైరా ప్లాంటేషన్ ఏరియాలను పరిశీలించారు. ఆయన వెంట కోరింగ రేంజ్ అధికారి, సిబ్బంది వున్నారు.



అయినవిల్లిలో కొబ్బరికాయల మొక్కు తీర్చుకుంటున్న సాయిశ్రీనివాస్

కోనసీమ ఆలయాల్లో సినీ నటుడు బెల్లంకొండ పూజలు

అయినవిల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు బెల్లంకొండ సాయిశ్రీనివాస్ గురువారం అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తండ్రి సురేష్ 50వేల కొబ్బరికాయల మొక్కులో భాగంగా 10వేల కొబ్బరికాయల మొక్కును చెల్లించుకున్నారు. స్వామి దర్శనం అనంతరం ఆయనకు ప్రధానార్చకుడు వేద ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

అంతర్వేది (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రముఖ సినీ హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ విచ్చేశారు. ఆయనకు అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అంతరాలయంలో స్వామివారి దర్శనం అనంతరం ఆయనకు వేదపండితులు మహదాశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను సూపరింటెండెంట్ పి.విజయసారథి అందించారు.

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రానికి ప్రముఖ సినీ నటుడు బెల్లంకొండ సాయిశ్రీనివాస్ విచ్చేశారు. ఆలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



వాడపల్లిలో దర్శనం....



అంతర్వేదిలో వేదాశీర్వచనం...

'పది'లో ఉత్తమ ఫలితాలకు 120 రోజుల కార్యాచరణ

విద్యా శాఖ ఆర్జేడీ నాగమణి



గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న నాగమణి

గొల్లప్రోలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో గతంలో కంటే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు 120 రోజుల కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని విద్యా శాఖ ఆర్జేడీ నాగమణి ఆదేశించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నత పాఠశాలలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించి వెనుకబడిన వారిని గుర్తించాలన్నారు. వారికి 120 రోజులు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. వారి ఉత్తీర్ణత బాధ్యతను సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని కోరారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులు అందరూ తప్పనిసరిగా తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. అక్షరాలు రాని ఆరో తరగతి విద్యార్థులుంటే గుర్తించాలన్నారు. బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆర్జేడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెజ్ బిరియానీ సరిగ్గా ఉడకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. భోజనం నాణ్యతగా ఉండేలా చూడాలని సూచించారు. ఆయన వెంట గొల్లప్రోలు మండల విద్యా శాఖాధికారి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, సూర్యప్రకాశరెడ్డి వున్నారు.



మల్లికార్జునరావు దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

సామర్లకోట భీమేశ్వరస్వామి సన్నిధిలో హైకోర్టు జడ్జి మల్లికార్జునరావు

సామర్లకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు జడ్జి టి.మల్లికార్జునరావు సతీ సమేతంగా గురువారం కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయానికి విచ్చేశారు. వారికి ఈవో బళ్ల నీలకంఠం, ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు) ఆధ్వర్యంలో పండితులు సాదర స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలోని అన్ని ఉపాలయాలను దర్శించిన మల్లికార్జునరావు దంపతులు భీమేశ్వరస్వామికి అభిషేకం, బాలా త్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన చేశారు. నంది మండపం వద్ద పండితులు చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), రాజగోపాలశర్మ, వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ వేదాశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల చిత్రపటం, శేష వస్త్రాలు, ప్రసాదాలను ఈవో అందజేశారు. ఈవో నీలకంఠం ద్వారా ఆలయ విశిష్టతను తెలుసుకుని తూర్పు చాళుక్యుల శిల్పకళా చాతుర్యానికి తన్మయులయ్యారు. సామర్లకోట సీఐ కృష్ణభగవాన్, వీఆర్వో నలజర్ల మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



దేదీప్యశ్రీకి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న హెచ్‌ఎం మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయురాలు కుమారి

జాతీయ స్కూల్ చెస్ పోటీలకు దేదీప్యశ్రీ ఎంపిక

కాకినాడ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లాలో మూడు రోజులు జరిగిన బాలురు, బాలికల చెస్ టోర్నమెంటులో అండర్-17 బాలికల విభాగంలో పాల్గొన్న కాకినాడ శ్రీరామ్‌నగర్ మున్సిపల్ స్కూలు విద్యార్థిని ఎస్. దేవి దేదీప్యశ్రీ జాతీయ స్కూల్ చెస్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 27 నుంచి 30 వరకు త్రిపురలో జరిగే జాతీయ స్కూల్ చెస్ పోటీల్లో ఈమె పాల్గొంటుంది. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం కేఎస్ఎన్ మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయురాలు సీహెచ్ కుమారి విద్యార్థినికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.



వరిచేలో కొంగలు కనువిందు

కాకినాడ జిల్లా పిఠాపురం జాతీయ రహదారి పక్కన వరిచేనులో గురువారం కొంగలు ఇలా సందడి చేశాయి. గుంపులు గుంపులుగా చేరి ఒకచోట నుంచి మరోచోటుకు ఎగిరిపోతూ.. మధ్యమధ్యలో ధాన్యం గింజలను తింటూ కడుపు నింపుకున్నాయి. ఈ అందమైన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా..

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

అక్రమ కట్టడాలపై కొరడా!

- వెంటనే కూల్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం
- జీవో నెం.225 విడుదల
- అనుమతి లేని నిర్మాణాలకు బీపీఎస్-2025 ద్వారా క్రమబద్ధీకరణకు అవకాశం
- దరఖాస్తుకు 120 రోజుల గడువు



కాకినాడ 40వ డివిజన్‌లో అక్రమ నిర్మాణాన్ని ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేస్తున్న దృశ్యం

దరఖాస్తుకు గడువు

నోటిఫికేషన్ వచ్చిన తేదీ నుంచి 120 రోజులు మాత్రమే. ఇది తుది అవకాశమని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అనుమతి లేని భవనాలు, అదనపు అంతస్తులు, అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చాలని స్పష్టం చేసింది. ఈ మేరకు బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం (బీపీఎస్-2025) మార్గదర్శకాలను విడుదల చేస్తూ జీవో నెం.225ను మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ బుధవారం జారీ చేసింది. భవనాల యజమానులు 1985 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు 31 వరకు నిర్మించిన అనుమతి లేని (లేదా) నిబంధనలకు విరుద్ధమైన భవనాలను ఒకసారి క్రమబద్ధీకరించుకోవచ్చు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు, సీఆర్‌డీఏ, వీఎంఆర్‌డీఏ, ఐఏఎల్‌ఏ పరిధిలోని గ్రామ పంచాయతీలు కూడా ఈ పథకం కిందకి వస్తాయి.

వీటికి అవకాశం లేదు

ప్రభుత్వ భూములు, ఎండోమెంట్స్, సాగర తీరం, నదీ తీరం, వాగు వెంబడి, ట్యాంక్ బండ్, మాస్టర్ ప్లాన్‌లో రోడ్లు, ఓపెన్ స్పేస్, పార్కుకు వినియోగించే ల్యాండ్‌లు, 2025 ఆగస్టు 31 తర్వాత కట్టిన నిర్మాణాలు, ల్యాండ్ డిస్ప్యూట్ ఉన్నవాటికి అర్హత లేదు.

ఎలా దరఖాస్తు చేయాలి...

www.bps.ap.gov.inలో రిజిస్ట్రేషన్ సేల్‌డీడ్ కాపీ, ఈసీ, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్, ప్లాన్ (ఉంటే), బిల్డింగ్ ఫొటోలు, స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్ (స్ట్రక్చరల్ ఇంజనీర్ నుంచి), ఇండెమ్నిటీ బాండ్‌లను దరఖాస్తుతో తప్పనిసరిగా జత చేయాలి. దరఖాస్తు ప్రారంభ రుసుము రూ.10వేలు చెల్లించి మిగతా జరిమానా మొత్తాన్ని 120 రోజుల్లోపు చెల్లించాల్సి ఉంటుంది.

రాయితీలు-ప్రత్యేక నిబంధనలు:

1997 డిసెంబరు 31లోపు పాత భవనాలకు 25 శాతం తగ్గింపు, స్లమ్ ప్రాంతాల్లో 50శాతం తగ్గింపు.

ఎవరకి వర్తింపు:

1985 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు 31 మధ్య కట్టిన భవనాలకు బీపీఎస్ వర్తిస్తుంది.

గతంలోనూ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే...

రాష్ట్ర ప్రభుత్వం బీపీఎస్ పథకాన్ని మరోసారి మరోసారి తీసుకొచ్చింది. ఈ మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అనుమతులు లేని భవనాలను క్రమబద్ధీకరించడా నికి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం ద్వారా నగర, పట్టణ ప్రజలు తమ నిర్మాణాలను, ప్లాట్లను చట్టబద్ధం చేసుకునే అవకాశముంటుంది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని తెచ్చింది. అయితే గడువు ముగియడంతో నిలిపివేశారు. అప్పటి దరఖాస్తుల్లో చాలా వరకు పరిష్కారమయ్యాయి. గత ప్రభుత్వంలో అనుమతులు లేకుండా చాలా నిర్మాణాలు జరిగాయి. ఇప్పుడు వాటి క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం ఇస్తోంది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేసింది. అయితే ఆ గడువు ముగియడంతో ఆ తర్వాత వాటిని ఆపేశారు. అప్పటి దరఖాస్తుల విషయానికి వస్తే బీపీఎస్‌కు సంబంధించి 90శాతం వరకు పరిష్కారమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో అనుమతులు తీసుకోకుండా చాలా భవనాలు, అదనపు అంతస్తుల నిర్మాణాలు జరిగాయి. దీనికి కారణం ఆ పార్టీ నేతల అండదండలు ఉండటమే. అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరించారనే ఆరోపణలొచ్చాయి. ఇటీవల చేపట్టిన ఇంటింటి సర్వేలో ఈ విషయాలన్నీ బయటపడడంతో ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది.

ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం



ప్రభుత్వం చివరి అవకాశంగా ఈ సంవత్సరం ఆగస్టు 31తో పూర్తయిన భవంతులకు బీపీఎస్ ద్వారా అవకాశం కల్పించింది. ఈ పథకం ద్వారా అనుమతులు లేకుండా లేదా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలు, అనధికార నిర్మాణాలకు అపరాధ రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. అటువంటి నిర్మాణాలు కూల్చివేస్తాం

– కృష్ణారావు, డిప్యూటీ సిటీ ప్లానర్, కాకినాడ నగరపాలక సంస్థ

జయ జయ.. సత్యదేవా

- పసుపుమయమైన అన్నవరం
- 3వేలమంది సత్యదీక్షల విరమణ
- ఉచిత సామూహిక వ్రతాలు

అన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి గురువారం సత్యదీక్షాపరులతో పసుపుమయంగా మారింది. 27 రోజుల పాటు అత్యంత నియమనిష్టలతో దీక్షలు చేపట్టిన సత్యదీక్షాపరులు దీక్షలను విరమించారు. శిరసున ఇరుముడులు పెట్టుకుని పలువురు మెట్టమార్గం, మరికొందరు వివిధ వాహనాల్లో స్వామి సన్నిధికి చేరుకున్నారు. వారందరికీ వార్షిక కల్యాణ వేదికపై ఉన్న అర్చకస్వాములు ఇరుముడులను స్వీకరించారు. వీటిని స్వామిపాదాల చెంతఉంచారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఏర్పాటు చేశారు. సుమారు 3వేలమంది సత్యదీక్షలను విరమించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు





ఇరుముడులు సమర్పిస్తున్న సత్యదీక్షాపరులు

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు

సత్యదేవుడి జన్మనక్షత్రం మఖ సందర్భంగా గురువారం మూలవరులకు జన్మనక్షత్రపూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. 2గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగనస్నానమాచరింపచేశారు. ఈ సందర్భంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృతాలతో మంత్రపూర్వకంగా అభిషేకం చేపట్టారు. అనంతరం నూతన పట్టువస్త్రాలు ధరింపచేసి సుగంధభరితపుష్పాలతో అలంకరించి సర్వదర్శనాలకు భక్తులను అనుమతించారు. యాగశాలలో ఆయుష్య హోమం నిర్వహించగా ఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్‌ఎంసీలో నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వంతో ఎంవోయూ



విజయవాడలో డీఎంఈకి ఎంవోయూ అందజేస్తున్న రాంకోసా ప్రతినిధులు

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం (రాంకోసా) ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. ఆర్‌ఎంసీ ప్రధాన భవనం పాతది కావడంతో దాని బలోపేతం కోరుతూ రాంకోసా బృందం చేసిన విన్నపానికి స్పందించి ప్రభుత్వం జీవో విడుదల చేసింది. గురువారం విజయవాడలోని డీఎంఈ కార్యాలయంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో బృందం డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్‌ను కలిసింది. ఈ నేపథ్యంలో రాంకోసా ప్రతినిధులు డీఎంఈని కలిసి రూ.15 కోట్లతో భవనాలు నిర్మించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. బిల్డింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, రాంకోసా కార్యదర్శి డాక్టర్ అరుణాదిత్య, డాక్టర్ వాడ్రేవు రవి పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

అమలాపురం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ పరిధిలోని కూచిమంచివారి అగ్రహారం శివారున నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై సీఐ వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. జనుపల్లికి చెందిన కడలి మహేష్, మురళీ దుర్గాప్రసాద్ (ముమ్మిడివరం), గ్రంధి ప్రసాద్ (అమలాపురం), అమలదాసు వెంకటేశ్వరరావుతో పాటు పట్టాభివీధిలో వ్యభిచారం నిర్వహిస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన మహిళను అరెస్టు చేశారు. రూ.2వేలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

గుండెపోటుతో వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయ డ్రైవర్ మృతి



శ్రీనివాసు (ఫైల్)

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఉన్న వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయ కారు డ్రైవర్ కే.శ్రీనివాసు (53) గురువారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. శ్రీనివాసు సామర్లకోటలో నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం 8 గంటలకు కాకినాడ వ్యవసాయశాఖ జేడీ కార్యాలయానికి బయలుదేరడానికి సిద్ధం అవుతుండగా గుండెపోటు వచ్చింది. దీంతో ఆయన్ని హుటాహుటిన సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది. ఎన్నో ఏళ్లుగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి కారు డ్రైవర్‌గా పని చేస్తూ మంచిపేరు తెచ్చుకున్నారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, ఇతర ఏడీలు, ఏవోలు, మినిస్టీరియల్ సిబ్బంది, కార్యాలయం సిబ్బంది, ఎఫ్‌టీసీ సిబ్బంది సామర్లకోటలో ఆయన గృహానికి వెళ్లి పరామర్శించారు. శ్రీనివాసు పార్థివదేహానికి శుక్రవారం అంత్యక్రియలు జరుగుతాయని వెల్లడించారు.

డ్వాక్రా సొమ్ములు స్వాహా..

- పెద్దాపురం మండలం వడ్లమూరులో డ్వాక్రా వీవోఏ చేతివాటం
- దశలవారీగా రూ.28లక్షల మాయం
- పోలీసులకు ఫిర్యాదు

పెద్దాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన సొమ్ములను బ్యాంకులకు జమ చేయకుండా వెలుగు వీవోఏ స్వాహా చేసిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం వడ్లమూరులో జరిగింది. ఈ విషయంపై ఏపీఎం పి.సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే... డ్వాక్రా వీవోఏగా పనిచేస్తున్న పువ్వుల గంగాభవాని మహిళా సమాఖ్య సంఘాల సభ్యుల నుంచి సొమ్ములు వసూలు చేసి... వాటిని బ్యాంకుకు చెల్లించకుండా సొంత ఖర్చులకు వినియోగించుకుంది. సుమారు 40మంది నుంచి రూ.28లక్షలు దశల వారీగా స్వాహా చేసింది. విషయం వెలుగులోకి రావడంతో ఏపీఎం సూర్యనారాయణ పోలీసులు, వెలుగు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఏపీఎం సూర్యనారాయణను వివరణ కోరగా దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాయవరంలోనూ..

రాయవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సొమ్ములు బ్యాంక్‌కు జమ చేయకుండా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం మాచవరం వెలుగు యానిమేటర్ రూ.107500 పక్కదోవ పట్టిందని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు వైదేహి గ్రూప్ అధ్యక్షురాలు కచ్చా శ్రావణి తెలిపింది. శ్రావణి మాట్లాడుతూ "తమ గ్రూపునకు సంబంధించి సొమ్ములను పలు దఫాలుగా బ్యాంక్‌కు కట్టినట్టు చూపి యానిమేటర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.70వేలతో పాటు మరో రూ.24 వేలు కలిపి మొత్తం రూ.94 వేలు.. ఇలా మొత్తంగా రూ.107500 సొమ్ములు స్వాహా చేసింది' అని పేర్కొంది. తమకు నకిలీ బ్యాంక్ స్లిప్‌లు ఇచ్చారని, తాము చెల్లించిన సొమ్ములకు ఆఫీసు రికార్డుల్లో వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించామన్నారు. దీనిపై వెలుగు ఏపీయం కె.నాగేశ్వరరావును వివరణ కోరగా వైదేహి గ్రూపు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై ఉన్నతాధికారుల ఆదేశాలపై సంఘం లావాదేవిలపై విచారణ నిర్వహిస్తున్నామన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. ఖమ్మం జిల్లా పేర్వంచకు చెందిన పరిమి నవీన్, నాగమణి దంపతులు రూ.1,11,116 విరాళంగా ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శనం కల్పించారు. దాత సత్యదీక్షను స్వీకరించి 27రోజులపాటు నియమనిష్ఠలతో ఆచరించి గురువారం విరమించడం విశేషం.



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత

వేంకటేశ్వరస్వామి ఆదాయం రూ.14.04 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

అమలాపురం టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో శ్రీవేంకటేశ్వరస్వామిదేవస్థానంలో హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. దేవదాయశాఖ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ధర్మకర్తల మండలి చైర్మన్ కంచిపల్లి అబ్బులు, ట్రస్టీల సమక్షంలో పోలీసులు బందోబస్తు నడుమ లెక్కింపు చేపట్టారు. 2 నెలల 15 రోజులకు గాను ప్రధాన హుండీ ఆదాయం రూ.11,48,271, శ్రీలక్ష్మీ గణపతి హుండీ ఆదాయం రూ.30,378, వైష్ణవీకనకదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.1,20,281, శ్రీజ్ఞానసరస్వతి హుండీ ఆదాయం రూ.45,218 రాగా మొత్తం రూ.14.04లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి పీవీవీ సత్యకుమార్ పేర్కొన్నారు.

పోస్టాఫీసుల్లో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సేవలు

- సీనియర్ సిటిజన్లకు ఎంతో సౌకర్యవంతం
- కాకినాడ డివిజన్ సూపరింటెండెంట్ కృష్ణ

కాకినాడ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సేవలు అందుబాటులో ఉన్నాయని తపాలా శాఖ కాకినాడ డివిజన్ సూపరింటెండెంట్ కె.కృష్ణ తెలిపారు. ఈ సేవలు సీనియర్ సిటిజన్లకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. పెన్షనర్లు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ అందించే డోర్‌స్టెప్ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సర్వీస్ ద్వారా గానీ, సమీపంలోని పోస్టాఫీసును జనరేట్ చేస్తారన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ జనరేట్ కోసం పోస్ట్‌మ్యాన్/గ్రామీణ డాక్ సేవక్ ద్వారా జీఎస్టీతో సహా నామమాత్రపు లావాదేవీ రుసుం రూ.70 వసూలు చేస్తారన్నారు. ఈ సేవ కోసం పెన్షనర్ ఆధార్ నెంబరు, పెన్షన్ వివరాలను అందించాలన్నారు. సర్టిఫికెట్ జనరేట్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పెన్షనర్ తన మొబైల్ నెంబరుకు నిర్ధారణ ఎస్ఎంఎస్ అందుకుంటారన్నారు. ఆ తర్వాత సర్టిఫికెట్‌ను మరుసటి రోజు పోర్టల్‌లో చూడవచ్చన్నారు. ఇందుకు పెన్షనర్లు సమీపంలోని పోస్టాఫీసును గానీ, పోస్ట్‌మ్యాన్, డాక్ సేవక్‌ను గానీ సంప్రదించాలన్నారు. వారు ఇంటింటికీ సేవ అందించడానికి, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ జనరేట్ చేయడానికి అభ్యర్థించే వ్యక్తిని చిరునామాలో కలుస్తారన్నారు. అందువల్ల పెన్షనర్లు ఈ డోర్‌స్టెప్ లైఫ్ సర్టిఫికెట్ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ కోరారు.

మరిడమ్మకు పంచామృతాభిషేకం



మరిడమ్మ

పెద్దాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో అమ్మవారి జన్మ నక్షత్రం మఖను పురస్కరించుకుని గురువారం పంచామృతాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితులు పూజలు చేశారు. బంగారు, వెండి పుష్పాలతో అర్చన అనంతరం ప్రసాద వితరణ గావించారు. ఆలయ సిబ్బంది రమణ, క్రాంతివీర్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

పిఠాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని గ్రంథాలయాధికారి రేపాక వెంకటరాము తెలిపారు. 14న స్వాతంత్ర సమరయోధుల వేషధారణ, 15న వ్యాసరచన, 16న వక్తృత్వం, 17న చిత్రలేఖనం, 18న దేశభక్తి గేయాలు, పోటీలు, 19న రంగవల్లుల పోటీలు నిర్వహిస్తామని 20న ముగింపు కార్యక్రమం ఉంటుందని చెప్పారు.



దత్తత ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకట్రావు

'చట్టవిరుద్ధంగా దత్తత తీసుకుంటే జైలు శిక్ష'

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు కాకినాడ అర్బన్ సీడీపీవో జ్యోతి ఆధ్వర్యంలో దత్తతపై గురువారం దుమ్ములపేట చర్చి వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీవో జ్యోతి మాట్లాడుతూ నవంబరు నెలను దత్తత మాసంగా జరుపుకుంటామని, పిల్లలు కావాలనుకునే తల్లిదండ్రులు చట్టబద్ధంగా దత్తత పొందేందుకు ప్రతాప్‌నగర్‌లోని శిశుగృహాన్ని సంప్రదించాలని సూచించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ చట్టవిరుద్ధంగా దత్తత తీసుకుంటే 3 నుంచి 7 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పీవోఐసీ శ్రీనివాస్, పీఏఎస్ఐసీ విజయ, శిశు గృహ మేనేజరు రేవతి, అంగన్వాడీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.


శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

కాకినాడ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కలెక్టర్ షాన్‌మోహన్ విజ్ఞప్తి మేరకు కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ రూ.82లక్షల సీఎస్ఆర్ నిధులతో గొడారిగుంటలోని మదర్‌థెరిస్సా మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణానికి ముందుకొచ్చింది. వాటి నిర్మాణానికి ఎమ్మెల్యే కొండబాబు గురువారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో చేరేందుకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు వస్తున్నా తరగతి గదుల కొరత వల్ల వీలు పడట్లేదన్నారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ యూనిట్ హెడ్ కె.జగన్నాథం మాట్లాడుతూ తరగతి గదుల కొరత వల్ల ఏ విద్యార్థీ చదువు మానేయకూడదనే ఉద్దేశ్యంతో సీఎస్ఆర్ నిధులతో వీటి నిర్మాణం చేపడుతున్నామ న్నారు. సీఎస్ఆర్ హెడ్ జయగోపాల్, హెచ్ఆర్ జీఎం పద్మనాభం, విద్యా శాఖ ఆర్జేడీ నాగమణి, ఎంఈవో, పాఠశాల సిబ్బంది, విద్యా కమిటీ చైర్మన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


క్వారీ డస్ట్‌తో రోడ్డు నిర్మాణం చేయిస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

సర్పంచ్ చొరవతో రోడ్డుకు మోక్షం

సర్పవరం జంక్షన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను సమయంలో కురిసిన వర్షాలు, వరద నీటితో సాయినగర్ గ్రావెల్ రోడ్డు గుంతలు, గతుకుల మయంగా మారింది. కాలనీల్లో నివసించే ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీల్లో నిధులు లేక వర్షాలు, వరదల సమయంలో స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పంచాయతీలో నిధుల లేమి, స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల కాక సిబ్బందికి సైతం జీతాలివ్వలేని పరిస్థితులు నెలకొన్నాయి. సాయినగర్ కాలనీ వాసుల రోడ్డు వెతలను గుర్తించిన తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ సొంత నిధులు రూ.80వేలు వెచ్చించి సుమారు కిలో మీటరున్నర పొడవునా గ్రావెల్‌తో రోడ్డు గతుకులు పూడ్చించారు. మెరక చేసి పైన క్వారీ డస్ట్‌తో రోడ్డును పునరుద్ధరించి రాకపోకలకు అనువుగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. సర్పంచ్‌కు సాయినగర్ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

'మనోబంధు ఫౌండేషన్ సేవలు భేష్'

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేకుండా రోడ్లపై తిరుగుతున్న అనాథలకు ఆశ్రయం కల్పించేందుకు మనోబంధు ఫౌండేషన్ చేస్తున్న సేవలు భేష్ అని ఇన్‌చార్జి కమిషనరు కేటీ సుధాకర్ తెలిపారు. మనోబంధు ఫౌండేషన్ పోస్టర్‌ను గురువారం ఆయన నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానసిక సమస్యలతో రోడ్లపై తిరుగుతున్న వారిని గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది గుర్తించి రెడ్‌క్రాస్ ద్వారా మనోబంధు ఫౌండేషన్‌లో అప్పజెప్పాలని సూచించారు. నగరంలోని 101 సచివాలయాల వద్ద ప్రత్యేక సమాచార కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై తిరుగుతున్న వారిని గుర్తించి 9246563738 నెంబరుకు సమాచారం అందించాలన్నారు. వారిని ఆసుపత్రిలో చేర్చి ఆరోగ్యవంతులుగా మార్చి, వీలైతే వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చే చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిప్యూటీ కమిషనరు కోన శ్రీనివాస్, డీసీపీ కృష్ణారావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, ఫౌండేషన్ సభ్యులు మణి, శ్రీనివాసు, సురేష్, దిలీప్, భాస్కర్ పాల్గొన్నారు.


'మనోబంధు' ఫౌండేషన్ గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కమిషనరు సుధాకర్

'ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'

సామర్లకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా త్వరితగతిన సొమ్ములు పొందాలని సామర్లకోట మండల వ్యవసాయాధికారి వి.మురళీధర్ రైతులకు సూచించారు. గురువారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో క్షేత్రస్థాయి సందర్శనలు చేశారు. వ్యవసాయ సిబ్బంది, రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పించారు. ఈ-పంట నమోదు ఉన్న రైతుల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. తేమ శాతం 17 వరకు ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని సూచించారు. మండలంలో గురువారం సాయంత్రానికి 590 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఎంఏవో తెలిపారు. ఆయన వెంట ఏఈవో శాంతి కమల, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు వున్నారు.

రహదారులపై చెత్తాచెదారం తొలగింపు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలోని ఎస్సీ కాలనీ రహదారుల వద్ద చెత్తాచెదారం పేరుకుపోయింది. దానిని గురువారం తొలగించారు. రోజుల తరబడి చెత్తను తొలగించకపోవడంతో దుర్గంధపూరిత వాతావరణం నెలకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌కు విన్నవించారు. ఎంపీ ఆదేశాలతో గొల్లప్రోలు ఎంపీడీవో సెలట్‌రాజు అక్కడకు చేరుకుని చర్యలు చేపట్టారు. పంచాయతీ సిబ్బందితో చెత్తను తొలగింపచేశారు. అనంతరం చెత్త వేస్తే కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మొలక శాతాన్ని పరీక్షించి విత్తనాలు విక్రయించాలి

వ్యవసాయ శాఖ జేడీ విజయ్‌కుమార్

పిఠాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరి విత్తనాల మొలక శాతాన్ని పరీక్షించిన తర్వాతే రైతులకు విక్రయించాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్ ఆదేశించారు. పిఠాపురంలోని వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలకు చెందిన విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్లతో గురువారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజన్లో పంటలకు ఏయే ఎరువులు వినియోగించాలన్న సూచనలకు అనుగుణంగా విక్రయాలు జరపాలని సూచించారు. యూరియా, డీఏపీలను ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విక్రయాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో పంట కోత ప్రయోగాలను జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి, వ్యవసాయాధికారులు సత్యనారాయణ, గంగాధర్, జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.


ఈవోకు వెండి పళ్లెం అందజేస్తున్న దాతలు

శృంగారవల్లభస్వామికి వెండి పళ్లెం బహూకరణ

పెద్దాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి శృంగారవల్లభ స్వామికి పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన బోడా వీర వెంకట గణేష్ సూర్యభగవానులు కిలో బరువైన వెండి పళ్లాన్ని గురువారం బహూకరించారు. దాతకు ఈవో వడ్డి శ్రీనివాసరావు స్వామివారి చిత్రపటం అందజేయగా పండితులు వేదాశీర్వచనం ఇచ్చారు. కార్యక్రమంలో అర్చకులు పెద్దింటి నారాయణచార్యులు, గోపాలచార్యులు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ మెయిళ్ల సంధ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మహా సంస్థానంలో సత్యదత్త వ్రతాలు

పిఠాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో గురువారం సత్యదత్త వ్రతాలు వైభవంగా జరిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులతో రుత్వికులు వ్రతాలు చేయించారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు బిల్వాలు, పుష్పాలతో పూజలు చేసి విశేషంగా అలంకరించారు. ఈవో సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా భగవాన్

తాళ్లరేవు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు వాసవీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా సామా భగవాన్ ఎంపికయ్యారు. ప్రజలకు చేసిన సేవలకు గాను తనకు ఈ పదవి లభించిందని ఆయన తెలిపారు. భగవాన్ ఎంపికపై చలపతి, మోహన్, నరేంద్రరెడ్డి, మూర్తి, మహాలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ అమలు జరిగేలా చూడాలి

ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ అమలు జరిగేలా చూడాలని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆదేశించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో ఓటర్ల జాబితా పర్యవేక్షకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ ప్రకారం ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాను 2002 ఓటర్ల జాబితాతో అనుసంధానించాలన్నారు. నోటిఫికేషన్ వెలువడిన 45 రోజుల్లో ఓటర్ల జాబితాపై పూర్తి విచారణ చేయాలన్నారు. ఇందులో భాగంగా ఓటర్ల చేర్పు, తొలగింపు ఉంటే కచ్చితంగా స్వీయ దరఖాస్తు ఉండాల న్నారు. కాకినాడ రూరల్ తహసీల్దారు ఎస్ఎల్ఎన్ కుమారి, అర్బన్ తహసీల్దారు వి.జితేంద్ర, ఎన్నికల సూపరింటెండెంట్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.


రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

సామర్లకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పవరంలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయం ఆవరణలో ఐదుగురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్‌గా రూ.9,91,602 విలువైన చెక్కులను గురువారం అందజేశారు. కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అరిగెల శ్రీనివాసు (బున్నీ), అవసరాల హరి, గింజాల శ్రీనివాసు, వెన్నపు చక్రధరరావు, అజయ్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

సామర్లకోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో ప్రతిభ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు మంచాల గగనవర్ష, నురుకుర్తి వైష్ణవి, మట్టపల్లి దేవీజాహ్నవి, ధర్మవరపు దేవి, బొగ్గుల చందుకార్తీక్, శెట్టిబత్తుల అమృత వైష్ణవి అద్భుత ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని గురువారం స్కూలు ఆవరణలో సత్కరించారు. అంతకు ముందుకు ట్రైనీ ట్రయంప్స్ ఒలింపిక్స్ పేరిట నిర్వహించిన క్రీడా దినోత్సవ వేడుకలను కరస్పాండెంట్ ఎస్వీజీ ప్రకాష్, లయన్స్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ సుధారాణి క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించారు. క్రీడా సెక్రటరీ లంక చోళ బద్రీనారాయణ విద్యార్థులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. వ్యాయామోపాధ్యాయులు మురళీకృష్ణ, సాయిలక్ష్మి పలు క్రీడలు నిర్వహించారు. టి.సునీత, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీగౌరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎం స్వనిధి 1.0లో చక్కని ప్రగతి

డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో పీఎం స్వనిధి 1.0 విజయవంతంగా కొనసాగి మంచి ప్రగతి సాధించిందని డిప్యూటీ కమిషనరు కె.శ్రీనివాస్ తెలిపారు. బ్యాంకర్లు సమన్వయంతో సహకరించడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని ఆయన ప్రశంసించారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో టీపీఆర్వో శైలజ అధ్యక్షతన పట్టణ స్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పీఎం స్వనిధి 2.0 కింద వివిధ బ్యాంకుల్లో పెండింగులో ఉన్న రుణాలను త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలన్నారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద మాట్లాడుతూ బ్యాంక్ లింకేజీ విషయంలో ఎమ్మెల్సీ మాడ్యూల్ ద్వారా వచ్చిన దరఖాస్తులకే ప్రాధాన్యమివ్వాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను తిరస్కరించాలని బ్యాంకర్లను కోరారు. ఎల్‌డీఎం ప్రసాద్, టౌన్ ప్రాజెక్టు అధికారి కె.శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజరు డి.వెంకటరాజు, డీసీవో ప్రసాద్, యూపీఏ సూపరింటెండెంట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి: ఎమ్మార్పీఎస్

కాకినాడ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ 17న తలపెట్టిన 'ఛలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక బాబూజగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మెస్పీ జిల్లా సహ ఇన్‌చార్జి పలివెల నవీన్ మాదిగ అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జి పసుపులేటి చిన్నిబాబు 'ఛలో ఢిల్లీ' కరపత్రాన్ని ఆవిష్కరించారు. జిల్లా సహ ఇన్‌చార్జి అనంతపు రాజు, దేవారపు సురేష్, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు తాతపూడి సత్యనారాయణ, పలివెల గోవింద్, జి.సురేష్, వేమగిరి సునీల్, మోర్ల కృపాకర్, మందపల్లి వెంకన్న, మహేష్, మిరియాల వీరబాబు, దూలపల్లి రవి, నడికుట్టి రాజు, తుమ్మలపల్లి సంతోష్‌కుమార్, మిరియాల రాజు తదితరులు పాల్గొన్నారు.


'చలో ఢిల్లీ' కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నేటి నుంచి అఖిల భారత సహకార వారోత్సవాలు

కాకినాడ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను శుక్రవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జిల్లా సహకార అధికారి బి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. 'ఆత్మనిర్భర్ భారత్‌కు సహకార సంఘాలు వాహనాలు' అనే నినాదాన్ని 2025 సహకార వారోత్సవాల సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అంతే కాకుండా ఐక్యరాజ్యసమితి 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించడంతో ఈసారి జరిగే సహకార వారోత్సవాలు ప్రత్యేకత సంతరించుకోనున్నాయని తెలిపారు. వారోత్సవాల నిర్వహణకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లోను శుక్రవారం సహకార పతాకావిష్కరణ చేయాలన్నారు. ప్రతిరోజూ ఒక ప్రత్యేక విషయంపై దృష్టిపెట్టి 20వ తేదీ వరకు సభ్యులతో సమావేశాలు, ఆరోగ్య శిబిరాలు, ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. సహకారవాదులంతా ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని డీసీవో కోరారు.


సహకార వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి

జగపతినగరంలో భారీ అన్నదానం

కిర్లంపూడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జగపతినగరంలో షిర్డీసాయి బాబా ఆలయం వద్ద గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మాచపల్లి రవి, చదలవాడ బాబి, గౌతు జగన్నాధరావు, పెంటకోట నల్లబాబు, అలీషా, బొడ్డేటి అప్పారావు, తోట శేషుబాబు, గంధం బూరి, పాముల చంటి, వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కష్టపడే కార్యకర్తలకు సముచిత గుర్తింపు

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

టీడీపీనియోజకవర్గ స్థాయి మండల, క్లస్టర్ యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారం



ఒమ్మంగిలో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడే ప్రతీ కార్యకర్తకు సముచిత గుర్తింపు ఉంటుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. మండలంలోని ఒమ్మంగి గ్రామం లక్ష్మి ఫంక్షన్ హాల్లో గురువారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి మండల, క్లస్టర్ యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకులు మెట్ల రమణబాబుతో కలిసి టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి నాయకులకు పంపిణీ చేశారు. 1200మందితో కూడిన మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ బూత్ కమిటీలో ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి కార్యకర్తలు ఎంతో కష్టపడి పని చేశారని వారి రుణం తీర్చుకోలేదని తెలిపారు. అంకిత భావంతో పని చేసే ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు గ్రామాల్లో కలియతిరుగుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్న తనకు కార్యకర్తలు అందరూ వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. జ్యోతుల నవీన్‌కుమార్, మెట్ల రమణబాబు మాట్లాడుతూ కార్యకర్తలే టీడీపీకి బలమని, కార్యకర్తలకు అండగాని నిలిచే పార్టీ టీడీపీ అని తెలిపారు. సమావేశంలో ఖాదీ బోర్డు ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మీసాల రాజు, ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి, దంటుమళ్ల రాజ్యలక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకర సోమరాజు, టీడీపీ మండలాధ్యక్షులు అమరాది వెంకట్రావు, బద్ది రామారావు, టి.సత్యనారాయణ, ఈగల అప్పారావు, పర్వత సురేష్, మాజీ ఎంపీపీ ఇతంశెట్టి భాస్కరబాబు, మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, సొసైటీ చైర్మన్ సత్యంశెట్టి సీతారాం పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం వనసమారాధన



ఆర్యవైశ్య మండలాధ్యక్షుడు శివను సత్కరిస్తున్న దృశ్యం

గండేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో మురారి గ్రామంలో గురువారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొని ఉసిరిచెట్టుకు పూజలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తున్న ఆర్యవైశ్య మండలాధ్యక్షుడు కొత్త చినవీరభద్రరావు(శివ)ను సంఘ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొత్త కొండబాబు, వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత ఆర్యవైశ్య రాష్ట్ర కార్యదర్శి మండవిల్లి వెంకటేశ్వరరావు, బంగార్రాజు, ఆర్యవైశ్య జిల్లా పాలకవర్గ సభ్యులు బూర్లు సాయి పాల్గొన్నారు.

రామాలయానికి టీవీ వితరణ



రౌతులపూడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో వెలమ కమ్యూనిటీ హాల్ వద్ద ఏడుకొండల రామాలయానికి మాజీ ఎంపీపీ ఇటంశెటి భాస్కరరావు కుమారుడు అశోక్ గురువారం పుట్టినరోజు సందర్భంగా ఎల్ఈడీ టీవీని అందజేశారు. శివాలయం ఆవరణలో శివ, అయ్యప్పదీక్షా స్వాములకు ఉచిత అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, యాళ్ల జగదీష్, రాష్ట్ర ఖాదీబోర్డు ఉప చైర్మన్ కొమ్ముల కన్నబాబు, రాష్ట్ర రహదారుల డైరెక్టర్ వెన్నా శివ, ఎంపీపీ గంటి మళ్ల రాజ్యలక్ష్మి, టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్య నారాయణ, కత్తిపూడి సత్రం చైర్మన్ సోమరౌతు మౌళి అశోక్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రత్తిపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చినశంకర్లపూడి గ్రామంలో అభయ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బొడేరామచంద్రయాదవ్ రూ.2లక్షల విరాళం అందజేశారు. ఈ నగదు మొత్తం గురువారం అందిందని ఆ ఆలయ కమిటీ సభ్యుడు నియోజకవర్గ బీసీ ఐక్య సంఘర్షణ కమిటీ కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ కమిటీ పెద్దలు, సగర సంఘం నాయకులు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం



కనకలక్ష్మి కుటుంబానికి ఇంటి తాళం అందజేస్తున్న మోహనరావు, జాస్తి వసంత్

గండేపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతీ పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని కమ్మ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, గండేపల్లి క్లస్టర్ ఇన్‌చార్జి మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్ అన్నారు. గురువారం మురారి గ్రామానికి చెందిన నీలి కనకలక్ష్మి కుటుంబానికి తాళాలు, నూతన గృహ నిర్మాణ మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 166 గృహనిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరికృష్ణసత్యరెడ్డి, హౌసింగ్ ఏఈలు వి.మణికంఠ, టి.శేఖర్, సొసైటీ చైర్మన్లు కంటిపూడి సత్యనారాయణ, దిడ్డి చిన్న శ్రీను, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ నరసింహరావు, సర్పంచ్ అడబాల రామాంజనేయులు, చావా చౌదరి, గద్దె అబ్బన్న, ఉండవిల్లి బుల్లయ్య,జాస్తి రాధాకృష్ణ తదితరులు ఉన్నారు.

రాచపల్లిలో అరుణాచలేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఆలయంలో హారతి ఇస్తున్న అర్చకుడు

ప్రత్తిపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాచపల్లిలో అరుణాచలేశ్వరుడికి గురువారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్తీకబహుళ నవమి పురస్కరించుకుని దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో సాంబదక్షిణామూర్తి హోమం చేపట్టారు. ఆలయ వ్యవస్థాపకుడు స్వామి రామానంద ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో కాకినాడకు చెం దిన పీఏవారణాసి రవిశర్మ తదితర ప్రముఖులు పాల్గొని అరుణాచలేశ్వరుడిని దర్శించుకున్నారు. విద్యార్థులు అపీత కుచాంబ అమ్మవారికి పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద కాశదీప పూజలు, పుష్కరిణి వద్ద మహిళలు గంగాహారతి కార్యక్రమం చేపట్టారు.

యనమలకు సన్మానం



గజమాలతో యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే దివ్యను సత్కరిస్తున్న దృశ్యం

తుని రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్యను తుని మండలం హెచ్ కొత్తూరు గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. అదే గ్రామంలో సగర సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు ములికి సూరిబాబును గుర్తించి రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియామకానికి కృషి చేసినందుకు వారిని సత్కరించారు. సగర కార్పొరేషన్ డైరెక్టర్ ములికి సూరిబాబు మాట్లాడుతూ యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య తనకు అప్పగించిన గౌరవ ప్రదమైన పదవిని బాధ్యతాయుతంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు సగర సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

తునిలో వైద్య శిబిరం

తుని రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తుని జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హైస్కూల్‌లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు గురువారం మెడికల్ క్యాంప్ ఐఈ సమన్వయ కర్త డి.గిరిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఈవోలు హాజరయ్యారు. ప్రత్యేక అవసరాల గల పిల్లలకు పరీక్షలు నిర్వహించి ఆప్తామాలజీ, ఆర్థోపెడిక్, ఆడియోలజీ విభాగాలకు సంబంధించిన ఉపకరణాలను అందజేసేందుకు సంబంధిత శాఖకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ కేతన్‌కుమార్, ఆప్తామాలజిస్ట్ డాక్టర్ మధురిమ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో కష్టపడి పనిచేసే వారికే పదవులు



టీడీపీ కమిటీ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేసే వారికే టీడీపీలో సముచిత స్థానం ఉంటుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తుని నియోజకవర్గంలో మండల కమిటీలు, క్లస్టర్, యూనిట్, గ్రామ కమిటీ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే యనమల దివ్య అధ్యక్షతన వేలాది మంది కార్యకర్తల మధ్య గురువారం అట్టహాసంగా జరిగింది. ముఖ్యఅతిథిగా యనమల రామకృష్ణుడు మాట్లాడారు. నిరంతరం ప్రజలతో మమేకమై ప్రజల మన్ననలు పొందుతూ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేసిన 1500మంది కార్యకర్తలకు మండల స్థాయి, గ్రామస్థాయి పార్టీ పదవులు కేటాయించామన్నారు. తన అడుగుజాడల్లో నడుస్తూ ఎమ్మెల్యే యనమల దివ్య పదికాలాలు ప్రజా సేవలో ముందుకు సాగేందుకు అడుగులు వేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే దివ్యకు అందరి సహాయ, సహకారాలు ఉండాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రతి చోటా టీడీపీ జెండా రెపరెపలాడాలని, అందుకు అనుగుణంగా కార్యకర్తలు పనిచేయాలని కోరారు.

కమిటీ సభ్యులతో ప్రమాణం చేయించిన ఎమ్మెల్యే దివ్య

తేటగుంటలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో మండల, గ్రామ, క్లస్టర్, యూనిట్, గ్రామ కమిటీ, బూత్ కమిటీ సభ్యులు 1500మందితో ఎమ్మెల్యే యనమల దివ్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.292కోట్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇదంతా కార్యకర్తల సహకారంతోనే జరిగిందన్నారు. నూతన కమిటీ సభ్యులు పార్టీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలన్నారరు. టీడీపీ తుని, తొండంగి, కోటనందూరు మండలాల అధ్యక్షులు చింతమనీడి అబ్బాయి, చొక్కా అప్పారావు, పోతల సూరిబాబుతో పాటు వందలాది మంది గ్రామ, క్లస్టర్, బూత్ స్థాయి కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ వై.కృష్ణ, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ యినిగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం చేసిన కూటమి ప్రభుత్వం

తొండంగి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. గురువారం ఏ.కొత్తపల్లిలో జరిగిన గృహ ప్రవేశాల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పేదలకు కూడు, గూడు, నీడ అందించాలన్న మౌలిక లక్ష్యంతో ఎన్టీఆర్ ప్రారంభించిన టీడీపీ నేటికీ చంద్రబాబు నాయకత్వంలో అదేబాటలో కొనసాగుతోందన్నారు.ప్రతి పేదవాడికి సొంతింటి కలను నెరవేర్చే బాధ్యత తెలుగుదేశం పార్టీ తీసుకుంటుందన్నారు. టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, కోడ వెంకటరమణ, ఆత్మ చైర్మన్ నరహరిశెట్టి సూర్యప్రకాష్, బీజేపీ నేత వెలుగుల గోపాల కృష్ణ, చొక్కా అప్పారావు, ఎంపీడీవో సాయినవీన్, తహశీల్దార్ కాంతారావు పాల్గొన్నారు.

పది పరీక్షా కేంద్రాల పరిశీలన

కోటనందూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కోటనందూరు, పాతకొట్టాం, మదర్ విద్యా నికేతన్‌లో పది పరీక్షా కేంద్రాలకు పెద్దాపురం డివిజనల్ ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్ శర్మ పరిశీలించారు. మూడూ కేంద్రాల్లో ఎన్ని గదులున్నాయి, వసతులు తదితర అంశాలను పరిశీలించారు. చేపట్టాల్సిన పనులపై సూచనలు చేశారు.విద్యార్థుల సిలబస్ నోట్ పుస్తకాలు పరిశీలించి ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. రామశేఖర్, సీఆర్పీ శేఖర్ పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పదిలో మంచి ఫలితాలు సాధించాలి

చింతూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని ప్రభుత్వ ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.శశికుమార్ పేర్కొన్నారు. గురువారం పదో తరగతి పరీక్షలు నిర్వహించే చింతూరు, మోతుగూడెం, నర్సింహాపురం, డొంకరాయి ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులతో మమేకమయ్యారు. ఎంఈవోలు, ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. చింతూరు, కూనవరం ఎంఈవోలు జి.వెంకటేశ్వరరావు, టి.లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఆదివాసీ యువత ఆర్థికంగా ఎదగాలి

చింతూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ యువత వృత్తి శిక్షణ పొంది ఆర్థికాభివృద్ధి చెందాలని ఐటీడీఏ ఏపీవో తులసి పేర్కొన్నారు. గురువారం చింతూరు సచివాలయంలో బిర్సా ముండా 150వ జయంతి పురస్కరించుకుని గ్రామ సభ నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని సర్పంచ్ కారం కన్నారావు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఏపీవో తులసి మాట్లాడారు. ఆదికర్మ యోగి ఐదేళ్ల ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.ఎంపీడీవో శ్రీనివాస్‌దొర, పంచాయతీ కార్యదర్శి గుంపెనపల్లి మోహనరావు, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, బీజేపీ మండల అధ్యక్షుడు బట్ట లక్ష్మయ్యరాజు, జనసేన మండల అధ్యక్షుడు మడివిరాజు, బీజేపీ నాయకుడు డీవీఎస్ రమణారెడ్డి, పీసా కమిటీ సభ్యుడు కారం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఏపీ జెన్కో హైడెల్ డైరెక్టర్‌ను కలిసిన కార్మిక సంఘం

మోతుగూడెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో ఏపీ జెన్కో అతిథి గృహంలో హైడెల్ డైరెక్టర్ సుజయ్ కుమార్‌ను గురువారం తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రీజనల్ కార్యదర్శి జాజుల రత్నాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.త్రినాధరావు, వైస్ ప్రెసిడెంట్ ఎం.పాండ్యన, కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు సతీష్‌బాబు, సభ్యులు వేలు స్వామి, శివ మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. ఈసందర్భంగా పలు సమస్యలను వారు ఆయనకు వివరించారు. అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని సుజయ్ కుమారు హామీ ఇచ్చారు.

ఆదివాసీలకు ఉపాధి కల్పించాలి

మోతుగూడెం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలోని కెనాల్, పవర్‌హౌస్‌ను గురువారం ఏపీ జెన్కో హైడెల్ డైరెక్టర్ సుజన్‌కుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింత రాంబాబు, సీఐటీయూ డొంకరాయి అధ్యక్షుడు డేవిడ్, గిరిజన సంఘ నాయకులు కె.ముక్త, మంగల్‌దన్, సురేష్, లైకన్ తదితరులు ఆయనను కలిసి సమస్యలు వివరించారు. ఏపీజెన్కో ఆధ్వర్యంలో సీలేరు, డొంకరాయి, మోతుగూడెంలో విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమలున్నా ఆదివాసీలకు చట్టప్రకారం ఉద్యోగ రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారన్నారు. బోర్డు యజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

టీడీపీ అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా ఇల్లా

చింతూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ అరకుపార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడుగా చింతూరుకు చెందిన ఇల్లా చిన్నారెడ్డి నియమితుల య్యారు. రంపచోడవరంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి గురువారం పలు కమిటీలను ప్రకటించారు. అలాగే కొత్త కమిటీల సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. టీడీపీ అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా చిన్నారెడ్డిని నియమించి, ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. న్యాయవాది అయిన చిన్నారెడ్డి ఇప్పటివరకు టీడీపీ మండల అధ్యక్షుడిగా పని చేశారు.

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బుజ్జి

దేవీపట్నం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన మరిశెట్ల వెంకటేశ్వరరావు బుజ్జి టీడీపీ అల్లూరి సీతారామరాజు జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. సీఎంచంద్రబాబు, ఎమ్మెల్యే మిరియాల శిరీష భాస్కర్, అబ్జర్వర్ కొల్లుబోయిన శ్రీనివాస్‌యాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ మండల కమిటీ ప్రమాణ స్వీకారం

కూనవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాస్‌యాద్, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, బాబు రమేష్ సమక్షంలో టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎడవల్లి భాస్కరరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల్, తెలుగు యువత, మైనార్టీ సెల్, ఇతర అనుబంధ సంఘాల సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, సొసైటీ చైర్మన్ తోటకూర వెంకన్న, రసూల్ పాల్గొన్నారు.

టీడీపీ మండల కమిటీ నాయకులు వీరే

రాజవొమ్మంగి నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలో గురువారం జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాజవొమ్మంగి మండల కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. టీడీపీ మండల అధ్యక్షుడిగా గొల్లపూడి పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శిగా వాసంశెట్టి గంగాధర్, ఉపాధ్యక్షులుగా జెట్టి మధు, సూరిశెట్టి సురేష్, తెలుగు యువత మండలాధ్యక్షుడిగా బారంగీ అనుదీప్, రంపచోడవరం నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలిగా ముప్పన సావిత్రి, తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

టీడీపీ అరకు పార్లమెంట్ కార్యదర్శిగా చలపతి

ఎటపాక, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) టీడీపీ అరకు పార్లమెంట్ కార్యదర్శిగా ఎటపాకకు చెందిన పాటి చలపతిని ఎమ్మెల్యే శిరీషాదేవీ నియమించారు. రంపచోడవరంలో గురువారం ఆయనను ఎమ్మెల్యే శిరిషాదేవి శాలువతో సన్మానించారు. చలపతికి తెలుగు యువత రాష్ట్రకార్యదర్శి వల్లభనేని చందు, నలజాల శ్రీకాంత్, గడేసుల రంజిత్ శుభాకాంక్షలు తెలిపారు.

గిరిజన రైతులకు చేప పిల్లలు పంపిణీ

రంపచోడవరం, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టామని ఐటీడీఏ ఏపీవో(జీ) డీఎన్వీ రమణ అన్నారు. గురువారం పందిరిమామిడిలో మత్స్యశాఖ ద్వారా రైతులకు చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రూ.16లక్షలతో చేప పిల్లలను కొనుగోలు చేసి 100మంది రైతులకు పూర్తి సబ్సిడీతో అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్డీవో ఎ.అనిల్‌కుమార్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు సత్యనారాయణ, శివ సాయి, సత్యవతి, ఎఫ్ఎం కుమారి పాల్గొన్నారు.

అధికారుల తీరు బాగాలేదు

సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం

కూనవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో కొంతమంది అధికారుల పనితీరు బాగాలేదని ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్ ప్రమేయం లేకుండా పెద్ద ఆర్కూర్ పంచాయతీ పరిధిలో గృహప్రవేశాలు చేస్తున్నారని సర్పంచ్ నాగమణి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ఆర్అండ్ఆర్‌కు సంబంధించి అధికారులు సభకు హాజరుకాకపోవడంతో రేగులపాడు ఎంపీటీసీ కొమరం పెంటయ్య మండిపడ్డారు. ఇటీవల రేపాక ఆశ్రమపాఠశాలలో బాలుడు తప్పిపోయి కూనవరంలో పోలీసులకు దొరకడంపై వివరణ ఇవ్వాలని టేకులబోరు ఎంపీటీసీ బండారు సాంబశివరావు ఏటిడబ్ల్యూవోను ప్రశ్నించారు. మండలంలో జలజీవన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, గోదావరి ముంపునకు గురైన గ్రామాలకు రూ.3వేలు పరిహారం ఇవ్వాలని సభలో సభ్యులు అధికారులను డిమాండ్ చేశారు. ఎంపీపీ రంగమ్మ,ఎంపీడీవో జగన్నాధావు, తహసీల్దార్ ధర్మేంద్ర పాల్గొన్నారు.

ఎంఈవోగా శ్రీనివాసరావు

వై.రామవరం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎంఈవోగా ఆర్ఎల్ శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంఈవో తాత బ్బాయిదొర ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. శ్రీనివాసరావు రంపచోడవరం నుంచి ఇక్కడకు వచ్చారు. ఎంఈవో-2 జోగేశ్వరరావు, పలువురు హెచ్ఎంలు, సిబ్బంది నూతన ఎంఈవోను సత్కరించారు.

టీడీపీ మండలాధ్యక్షుడిగా వెంకటరమణారెడ్డి

అడ్డతీగల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా జర్త వెంకటరమణారెడ్డి నియమితులయ్యారు. గురువారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, పార్టీ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చిన్నం బాబురమేష్, వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో రంపచోడవరంలో ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే అనుబంధ కమిటీల ప్రమాణస్వీకారం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



రైతులకు మందులు అందిస్తున్న దృశ్యం

గండేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మురారిలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పాడిరైతులకు నట్టల నివారణ మందులు, మినరల్ మిక్చర్ పాకెట్లు, ఇతర మందులు పంపిణీ చేశారు. సుమారు 15 పశువులకు వైద్య పరీక్షలు, 20 పశువులకు గర్భకోశ చికిత్సలు ఐదు పశువులకు చూడి పరీక్షలు చేశారు. ఉప సర్పంచ్ జాస్తి వసంత్, ఉండవిల్లి బుల్లిరాజు, చావా తమ్మన్నచౌదరి, పశువైద్యులు డాక్టర్ ప్రగడ శ్రీనివాస్, పి.కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

'ఆదిత్య'లో అవగాహన సదస్సు

గండేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో ఉద్యోగ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విజన్ టెక్ వ్యవస్థాపకుడు ముఖ్యకార్యనిర్వాహణ అధికారి వినయ్‌తేజ, డైరెక్టర్ అంజన్‌కుమార్ హాజరయ్యారు. ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ ఇన్ ఫార్మా స్యూటికల్స్, మెడికల్ కోడింగ్, ఫార్మకోవిజిలెన్స్, క్లినికల్ సాస్ ప్రోగ్రామింగ్‌లపై ఆయన వివరించారు.

పొలంబడి కార్యక్రమం

కిర్లంపూడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కొల్లు గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండలంలో మొత్తం 18 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, రైతులంతా ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని మద్దతు ధర పొందాలని అధికారులు సూచించారు. ధాన్యానికి 17 తేమశాతం ఉండాలన్నారు. సాధారణ రకానికి 75 కిలోలకు రూ.1777, గ్రేడ్ ఏ రకానికి 75 కిలోలకు రూ. ధరలు నిర్ణయించారు. వీఏఏ దేవి ఉన్నారు.



ముక్కొల్లులో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం